JANA SAINYAM
# జనసైన్యం
ప్రజల పక్షం జనసైన్యం
తెలుగు దినపత్రిక



కరీంనగర్ జిల్లా. సంపుటి 3. సంచిక 317 06 సోమవారం జూలై 2026 ఎడిటర్ గుంటపల్లి స్వామి https://epaper.janasainyam.in పేజీలు: 12 రూ.5

# క్రీడా రంగానికి అండగా నరేందర్ రెడ్డి

















కరీంనగర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ మాస్టర్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో కరీంనగర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి జన్మదినని పురస్కరించుకొని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో వందమంది పైగా బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడా రంగానికి క్రీడాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆట ఏదైనా వారిని ప్రోత్సహించడంలో ముందు ఉంటారని కరీంనగర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ నరేందర్ అన్నారు. ఈ సందర్భంగా ముందస్తు జన్మదినం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కేకును కట్ చేశారు. నరేందర్ రెడ్డి కి బ్యాడ్మింటన్ క్రీడాకారులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడల్లో జాతీయస్థాయిలో పేరు తెచ్చుకున్న వాలీబాల్ ప్లేయర్ రోడ్డ శ్రీధర్ ను, స్విమ్మింగ్ పూల్ పోటీలలో జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్న సాత్విక్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్ గుంటపల్లి స్వామి. ప్రధాన కార్యదర్శి బాబు, కరీంనగర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్రీడాకారులు, కందుకూరి శంకర్. రాజిరెడ్డి. నామ రమేష్. భాస్కరరావు. శ్రీనివాసరెడ్డి, కోట శ్రీనివాస్. రాధాకృష్ణ, శ్రవణ్ ,రాజేందర్, పవన్, రఘు, నాగరాజు ప్రభాకర్, సురేందర్, దామోదర్, విజయ్ ,రాజు యాదవ్ మల్లేష్ యాదవ్, కోట శ్రీనివాస్, శివ శంకర్, రమేష్ శ్రియా పాల్గొన్నారు అలాగే ఈరోజు బ్యాట్మెంటన్ దినోత్సవం పురస్కరించుకొని సీనియర్ బ్యాడ్మింటన్ ప్లేయర్ సంధి రాజి రెడ్డీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయనను సన్మానించి ఆయనతో కేక్ కట్ చేయించిన కరీంనగర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ అధినేత నరేందర్ రెడ్డి. అలాగే ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో 50 మంది బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు. రసవత్తరంగా జరిగిన బ్యాడ్మింటన్ ఒపెన్ పోటీలలో విన్నర్ హరీష్ ,మురళి గెలుపొందినారు. రన్నర్ గా సాత్విక్. సౌరబ్ నిలిచారు. అలాగే అండర్ 11 లో బాలుర విభాగంలో అక్షిత్. కృతిక్ విన్నర్ గెలుపొందారు. రన్నర్ గా శౌర్య కార్తికేయ గెలుపొందారు. అండర్ 14 బాలుర విభాగంలో తేజస్, శ్రావిక్ విన్నర్గా గెలుపొందారు.రన్నర్గా ఆదిత్య. మానిథర్. గెలిచారు .

అండర్ 14 బాల విభాగంలో ఆరుష్. సత్య విజేతలుగా నిలిచారు. రన్నర్ గా తేజస్ సార్విక్ నిలిచారు.

బాలికల విభాగం

అండర్ 11 లో విన్నర్ గా వేదశ్రీ. త్రిషిక గెలుపొందారు. రన్నర్ గా ఆశ్రిత సుమికి నిలిచారు.

అండర్ 14 బాలికల విభాగంలో

నందిని శ్రేష్ట విన్నర్ గెలుపొందారు. రన్నర్ గా సిరి చందన సహస్ర నిలిచారు.

అండర్ 16 లో అతిధి వైశాలి మధ్య రన్నర్ గెలుపొందగా రన్నర్ గా నందిని శ్రేష్ఠ గెలుపొందారు.





## రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంప్రదాయ కులవృత్తుల కళాకారులకు స్టాల్స్

### మంత్రి పొన్నం ప్రభాకర్



**జనసైన్యం సిటి**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాల సందర్భంగా జూలై 16 నుంచి హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్ (పెద్ద అంబేద్కర్ విగ్రహం పక్కన) రాష్ట్రస్థాయి చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శన అమ్మకాల మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బోనాల పండుగకు అవసరమైన అన్ని రకాల చేతివృత్తుల ఉత్పత్తులు ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ సంప్రదాయ కళలు, గ్రామీణ వృత్తిదారులకు ఈ మేళా గొప్ప వేదికగా నిలుస్తుందని, బోనాలు కేవలం ఆధ్యాత్మిక ఉత్సవమే కాకుండా తెలంగాణ సంస్కృతి, కళలు, చేతివృత్తుల వైభవాన్ని ప్రతిబింబించే మహోత్సవమని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, విశ్వబ్రాహ్మణ, పద్మశాలి, నేత కళాకారులు, బంగారు పనివారు, రాతి శిల్పులు, బుట్టల తయారీదారులు, తోలు కళాకారులు తదితర సంప్రదాయ కులవృత్తులకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రజలకు విక్రయించే అవకాశాన్ని ఈ మేళా కల్పిస్తోందని తెలిపారు.

బోనాల సందర్భంగా అవసరమయ్యే మట్టి బోనం కుండలు, మట్టి దీపాలు, వెదురు బుట్టలు, గంపలు, జల్లెడలు, పిత్తళి ,రాగి చెంబులు, కలశాలు, ఘటాలు, గంటలు, పూజా సామగ్రి, వెదురు అలంకరణ వస్తువులు, పూల దండలు, తోరణాలు, బోనం అలంకరణ వస్త్రాలు, గాజులు, పూసల అలంకరణ సామగ్రి, పోతురాజు ఉపయోగించే కొరడాలు, కాళ్ల గజ్జెలు, డప్పులు, డోలు వంటి సంప్రదాయ వాద్యాలు, చెక్కతో తయారుచేసిన పూజా పీటలు, చిన్న మండపాలు తదితర అనేక వస్తువులు ఈ మేళాలో అందుబాటులో ఉంటాయని మంత్రి వివరించారు.బోనాల పండుగతో కుమ్మరి, మేదరి, కంసాలి, వడ్రంగి, డప్పు కళాకారులు, పూల వ్యాపారులు, వస్త్ర కళాకారులు తదితర వేలాది మంది సంప్రదాయ చేతివృత్తిదారులకు ఉపాధి లభిస్తుందని, ఈ మేళా వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడటమే కాకుండా తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.గత ఏడాదితో పోలిస్తే ఈసారి మరింత ఎక్కువ మంది చేతివృత్తి కళాకారులకు అవకాశం కల్పిస్తూ, అధిక సంఖ్యలో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. గతంలో కుమ్మరి, మేదరి, వడ్రంగి, గీత కార్మికులు, పూసల కళాకారులు, కంచరి, నేత తదితర వృత్తులవారు విజయవంతంగా తమ ఉత్పత్తులను విక్రయించారని, ఈసారి ఇంకా ఎక్కువ కులవృత్తులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని చెప్పారు.ప్రజా ప్రభుత్వం చేతివృత్తుల పరిరక్షణకు, సంప్రదాయ కళాకారుల జీవనోపాధి బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, వారి ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం, ఆదాయాన్ని పెంచడం, యువతను సంప్రదాయ వృత్తుల వైపు ప్రోత్సహించడం ఈ మేళా ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో వివిధ కులవృత్తుల కళాకారులకు హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నేరుగా అమ్మకాలు నిర్వహించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. బోనాల ఉత్సవాల సందర్భంగా నగరానికి వచ్చే లక్షలాది మంది భక్తులు ఈ మేళాను సందర్శించి చేతివృత్తుల ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారుల కుటుంబాలకు అండగా నిలవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.మనం కొనుగోలు చేసే ప్రతి చేతి ఉత్పత్తి ఒక కళాకారుడి కుటుంబానికి భరోసా, ఒక సంప్రదాయ వృత్తికి జీవం అని పేర్కొన్న మంత్రి, తెలంగాణ సంస్కృతిని కాపాడుతూ చేతివృత్తులకు కొత్త ఊపునిచ్చే ఈ మేళాను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో నిర్వహిస్తున్న ఈ రాష్ట్రస్థాయి చేతివృత్తుల మేళాను ప్రోత్సహించేందుకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున ఈ మేళాను సందర్శించి సంప్రదాయ చేతివృత్తులను ఆదరించి విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.






## లహరికి జన్మదిన శుభాకాంక్షలు




## అక్షిత కు జన్మదిన శుభాకాంక్షలు



## రామ్‌నాయుడుకి జన్మదిన శుభాకాంక్షలు

# ప్లాస్టిక్ భూతాన్ని తరమకపోతే మానవాళి మనుగడ ప్రశ్నార్థకమే



జనసైన్యం సిటి

ప్లాస్టిక్ భూతం ప్రపంచ మానవాళినే కాకుండా జీవకోటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నదని, ప్రతి పౌరుడు విధిగా ప్లాస్టిక్ రహిత జీవన విధానాన్ని పాటించాలని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ రోజు మేయర్ క్యాంపు ఆఫీసులో శాతవాహన లయన్స్ క్లబ్ నిర్వహించిన ప్లాస్టిక్ బ్యాగ్ రహిత సమాజ నిర్మాణం జరగాలనే ఉద్దేశంతో తయారు చేసిన గోడ పత్రికను ఆవిష్కరించిన మేయర్ క్లబ్ చూపిన చొరవను ప్రశంసించి మాట్లాడుతూ నగర మురికి కాలువలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి ఉన్నాయని, వాటిని తొలగించడానికి కార్పొరేషన్ సిబ్బంది ఎంతో శ్రమించాల్సి వచ్చిందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు సుస్థిర హరిత జీవనశైలిని అలవర్చుకోవాలని, లేని పక్షంలో క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధుల ముప్పు తప్పదని హెచ్చరించారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం చైతన్య కార్యక్రమాలు చేపట్టేందుకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తుందని, నగర పౌరులు ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా నగర మేయర్ శ్రీనివాస్‌ను క్లబ్ సభ్యులు సముచితంగా సత్కరించారు. ఈ సమావేశంలో శాతవాహన లయన్స్ క్లబ్ నాయకులు లయన్: కెప్టెన్: డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు లయన్: డాక్టర్: వడ్లూరి శ్రీనివాస్, కార్యదర్శి లయన్: నార్ల వేణుగోపాల్, కోశాధికారి లయన్: సిఏ మెరుగు ప్రవీణ్ కుమార్, లయన్: పచ్చునూరి సురేందర్, లయన్: ఎడవెల్లి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుంట్ల కవితక్క అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం



జనసైన్యం సిటి

శాతవాహన యూనివర్సిటీ వేదికగా నిర్వహించిన మీడియా సమావేశంలో శాతవాహన యూనివర్సిటీ జేఏసీ చైర్మన్, తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర నాయకులు చెన్నమల్ల చైతన్య మాట్లాడుతూ, జూలై 2న హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలాల కేటాయింపు కోసం చేపట్టిన "భూ పోరాటం" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లిటీఆర్ఎస్ పార్టీ అధినేత్రి శ్రీమతి కల్వకుంట్ల కవితక్క ని పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది విద్యార్థులు, యువత, ఉద్యమకారులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని, ఉద్యమకారుల కుటుంబాలకు 250 గజాల స్థలం ఇస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయకపోవడం బాధాకరమని అన్నారు.తెలంగాణ ఉద్యమకారులు, రైతులు, సింగరేణి కార్మికులు, నిరుద్యోగులు మరియు అన్ని వర్గాల ప్రజల సమస్యలపై పోరాడుతున్న కవితక్క కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు ఈ పరిణామాలను గమనిస్తున్నారని, ప్రజల తీర్పే దీనికి సమాధానం చెబుతుందని అన్నారు.నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ముఖ్యంగా కానిస్టేబుల్ నియామకాల వయోపరిమితిని పెంచాలని, వయోపరిమితి కారణంగా వేలాది మంది యువత నష్టపోతున్నారని ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు.తెలంగాణ ఉద్యమకారులు, నిరుద్యోగులు, రైతులు మరియు బలహీన వర్గాల పక్షాన తెలంగాణ రక్షణ సేన పార్టీ, పార్టీ అధినేత్రి శ్రీమతి కల్వకుంట్ల కవితక్క నాయకత్వంలో నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు సబ్బు నాగరాజు, కొండపాక రాకేష్, ఉమర్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి



**జనసైన్యం సిటి**

క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు (BLOs) చేపడుతున్న ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వేను పర్యవేక్షించిన ఆయన, బీఎల్వోలకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. బీఎల్వోలు ప్రతి ఇంటికి వెళ్లి, ప్రతి ఓటరుకు తప్పనిసరిగా ఫారాలు చేరేలా బాధ్యతాయుతంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లకు ఫారాలు ఇవ్వడమే కాకుండా, పూర్తిచేసిన ఫారాలను తిరిగి ప్రతి ఓటరు వద్ద నుండి సేకరించాలని తెలిపారు. ఈ ప్రక్రియలో ఏ ఒక్క ఓటరుకు కూడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పారదర్శకంగా, పకడ్బందీగా జరగాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు తమ బాధ్యతలను నిర్వర్తించాలని అధికారులకు స్పష్టం చేశారు.




## ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**జనసైన్యం సిటి**

కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రెండవ డివిజన్ పరిధిలోని తీగలగుట్టపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న అపార్ట్మెంట్ ఆవరణలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ గారి సహకారంతో, మలయప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిఎస్ఆర్ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, యువతలో శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు ప్రతి కాలనీలో ఇలాంటి ప్రజా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో అవసరమని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారు నిరంతరం సహకారం అందిస్తున్నారని తెలిపారు. మలయప్ప ఫౌండేషన్ సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఈ ఓపెన్ జిమ్‌ను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ కమిటీ సభ్యులు, రెండవ డివిజన్ ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కార్పొరేటర్లకు ఫోన్లు లేవా?

## గుడికందుల సత్యం సిపిఎం నగర కార్యదర్శి

**జనసైన్యం సిటి**



కార్పొరేటర్లు,కో ఆప్షన్ సభ్యుల ఫోన్ల కోసం రూ: 28 లక్షలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ మున్సిపల్ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం డిమాండ్ చేశారు. నగరంలోని ప్రజలు చెల్లిస్తున్న నీటి పన్ను, చెత్త పన్ను, ఇంటి పన్నుల రూపంలో చెల్లిస్తున్న డబ్బుల కార్పొరేటర్లకు, కౌన్సిల్ సభ్యులకు ఫోన్లు కొనివ్వడం సిగ్గుచేటు అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రజావాణి, ఫోన్ ఇన్ కార్యక్రమాలు ఉన్నాయని, అయినప్పటికీ ఒక్కో కొత్త ఫోను కు 40, వేల రూపాయలు వెచ్చించి 70 ఫోన్ లను కొనుగోలు చేసి 28 లక్షల రూపాయలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. ఇప్పటివరకు కార్పొరేటర్లకు ఫోన్లు లేవా అని ప్రశ్నించారు. ఇప్పటికే ఒక్కో కార్పొరేటర్ కు రెండు మూడు ఫోన్లు ఉన్నాయని, ఫోను లేని కార్పొరేటర్ కరీంనగర్లో లేరని అయినా ఫోన్ లో కొనుగోలుకు ప్రజాధనాన్ని వెచ్చించడమేంటని ప్రశ్నించారు. గత పాలకవర్గం ఏర్పాటైన మొదట్లో కార్పొరేటర్ లందరికీ ఫోన్లు కొని, పదవి కాలం పూర్తయిన వెంటనే తిరిగి తీసుకున్నారని ఆ ఫోన్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. నగరంలో అనేక ప్రజా సమస్యలు ఉన్నాయని చిరుజల్లులకే సుభాష్ నగర్, మంచిర్యాల చౌరస్తా, గాంధీ రోడ్, హాస్పటల్ స్ట్రీట్ జలమయం అవుతున్నాయని, కుప్పలు తిప్పలుగా చెత్త పేరుకు పోతుందని, వీధిలైట్లు, డ్రైనేజీ సౌకర్యం లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే పరిష్కరించవలసిన అధికారులు ప్రజాధనంతో కార్పొరేటర్లకు ఫోన్లు కొనుగోలు చేయడమేంటని అన్నారు. ఇప్పటికైనా టెండర్లను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

# గ్రామీణ సాధికారతతో ప్రపంచ మానవాళిపై సానుకూల ప్రభావం

ఆచార్య : మధుసూధన్ రెడ్డి బుర్ర
గ్రామీణ పేదరిక నిర్మూలన, ఆర్థిక సామాజిక

## (జూలై 06న "ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవం" సందర్భంగా)



అసమానతల తొలగింపు, ప్రజారోగ్య పరిరక్షణ, కనీస వసతుల లేమి, నిరుద్యోగ నిర్మూలన, విద్యాహక్కు చట్టం అమలు, , ఆకలి చావులను నిర్మూలించడం, చైతన్యశీల సమాజ స్థాపన, అలాగే సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డిజిలు) దిశగా పురోగతిని సాధించడంలో గ్రామీణాభివృద్ధి పథకాల కీలక పాత్రపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు, 2024లో జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం జూలై 06వ తేదీని అధికారికంగా "ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవం"గా ప్రకటించింది. గ్రామీణ ప్రాంతాలలో పేదరికం, ఆకలిని తగ్గించడానికి, ఉత్పాదక ఉపాధి మరియు వ్యవస్థాపకతను పెంపొందించడానికి, అలాగే గ్రామీణ సమాజాలు లేదా సంస్థలకు డిజిటల్ ఆర్థిక సదుపాయాన్ని విస్తరించడానికి, అవసరమైన మౌలిక సదుపాయాలు మరియు సేవలలో వ్యూహాత్మక పెట్టుబడులు ప్రాథమికమైనవని కూడా ఈ రోజు నొక్కి చెబుతున్నది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాలు, పౌర సమాజం, అంతర్జాతీయ సంస్థలు, విద్యాసంస్థలు సంయుక్తంగా ప్రభావవంతమైన కార్యక్రమాలను నిర్వహించడం, విధాన చర్చలను సులభతరం చేయడం, గ్రామీణాభివృద్ధి దిశగా ముందుకు నడిపించే క్షేత్రస్థాయి కార్యక్రమాలను ప్రారంభించడం ద్వారా ఈ వార్షిక దినోత్సవాన్ని ఆచరణలో పెట్టాలని ప్రోత్సహిస్తున్నది.

### గ్రామీణ ఉపాధి, ప్రపంచ మానవాళిపై సానుకూల ప్రభావం

ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవం-2026 యొక్క ఇతివృత్తంగా "గ్రామీణ ఉపాధి, ప్రపంచ మానవాళి పై సానుకూల ప్రభావం" అనబడే అంశాన్ని తీసుకొని పేదరికం, ఆకలి, ఆహార అభద్రత వంటి తీవ్రమైన సమస్యలను పరిష్కరించడానికే కాకుండా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి గ్రామీణ సమాజంలో పెట్టుబడుల పాత్రను నొక్కి చెబుతోంది. కృత్రిమ మేధస్సు (AI), డిజిటల్ టెక్నాలజీలోని పురోగతులను గ్రామీణ, వ్యవసాయ వర్గాలకు అందుబాటులోకి తీసుకురావడం, గ్రామీణ మహిళలను ఆర్థికంగా సాధికారత కల్పించడానికి స్వయం సహాయక బృందాల (SHGలు) వంటి కార్యక్రమాలను ప్రోత్సహించడం, అలాగే గ్రామీణ ఆరోగ్యం, ఆర్థిక, గృహనిర్మాణం, కనెక్టివిటీ రంగాలలో పెట్టుబడులకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలపై దృష్టి సారించాల్సిన సమయం ఇది. భారతదేశంలో, "గ్రామీణాభివృద్ధి పితామహుడిగా" సాధారణంగా గ్రామ స్వరాజ్ దార్శనికతకు గాను "మహాత్మా గాంధీ"ని, లేదా ప్రపంచంలోనే మొట్టమొదటి భారీ "సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను" అమలుకు కృషి చేసిన "సురేంద్ర కుమార్ దే"ని కూడా పేర్కొంటారు.

### భారతదేశంలో సహకార ఉద్యమం:

భారతదేశ గ్రామీణాభివృద్ధి పథకాలు అనేవి పేదరికాన్ని నిర్మూలించడం, ఉపాధి కల్పించడం, మౌలిక సదుపాయాలను నిర్మించడం, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడం కోసం రూపొందించిన ప్రభుత్వ కార్యక్రమాలను పేర్కొనవచ్చు. ఈ గ్రామీణాభివృద్ధి పథకాలను "గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ" నిర్వహిస్తుంది. గృహవసతి, జీవనోపాధి, కనెక్టివిటీ, సామాజిక భద్రత వంటి రంగాలను విస్తరించడానికి నిరంతర కృషి జరుగుతోంది. భారతదేశపు ప్రధాన గ్రామీణాభివృద్ధి పథకాలుగా నాడు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (MGNRE-GA) లేదా నేడు వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (విబి - జి రామ్ జీ), ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (PMAY-G), దీన్‌దయాల్ అంత్యోదయ యోజన - జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, ప్రధాన మంత్రి గ్రామ సదర్ యోజన, DDU-GKY, NSAP మొదలైనవి. తెలుగు రాష్ట్రాలలో సహకార ఉద్యమం విస్తృతమైన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (PACS), జిల్లా సహకార మార్కెటింగ్ సంఘాలు (ఐజమీా), పాడి సహకార సంఘాలు, చేనేత ఒ నేత కార్మికుల సంఘాలు, మత్స్య పరిశ్రమ మొదలైన సహకార సంఘాలు నడపబడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో బలహీన వర్గాలు, రైతుల సమస్యలను పరిష్కరించడానికి వేలాది క్రియాశీల సంఘాలు పని చేస్తున్నాయి.

గ్రామం లేనిదే దేశం లేదు. దేశానికి వెన్నెముక వ్యవసాయ రంగం. వ్యవసాయంతో పాటు పారిశ్రామిక ప్రగతి కూడా జరిగితే అసలైన వికసిత్ భారత్ సుసాధ్యం అవుతుంది. సమగ్ర గ్రామీణాభివృద్ధికి పటిష్ట పునాదులు వేసి, గ్రామీణ వికాసంతో పల్లెల్లో నవ్వులు పూయిస్తే నా నేటి భారతం రేపటి ప్రపంచానికి ఆదర్శ గురువుగా నిలుస్తుందని నమ్ముతూ ముందడుగు వేద్దాం.

# సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేసిన మేయర్



**జనసైన్యం సిటి**

కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రెండో డివిజన్ తీగలగుట్టపల్లిలోని సరస్వతి నగర్, రోడ్ నెం. 5లో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు అందించేందుకు నగరపాలక సంస్థ కృషి చేస్తోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి, నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భాస్కర్ నాయక్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులతో జర జాగ్రత్త !

## (06 జూలై "ప్రపంచ జునోసిస్ దినం" సందర్భంగా)

ఆచార్య : బుర్ర మధుసూదన్ రెడ్డి

అనాదిగా మనిషికి, పశుపక్ష్యాదులకు మధ్య అవిభాజ్య సంబంధం బలపడింది. గ్రామీణ వ్యవసాయ కుటుంబంలో ఎడ్లు, బర్రెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు, పిల్లులు, బాతులు, పక్షులు, గుర్రాలు, పందులు, కుందేళ్లు మొదలైన పెంపుడు జంతువులు భాగమై ఉంటాయి. ఈ పెంపుడు జంతువులతో మానవులు ప్రేమను పంచుకుంటూ, వాటిని కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వాటి ఆలనాపాలనా చూసుకుంటూ, ఎత్తుకొని ముద్దు చేస్తూ, భుజాన వేసుకొని తిరుగుతూ ఉంటారు. ఇలాంటి సాదు జంతువులు వ్యాధికారక సూక్ష్మజీవులైన బ్యాక్టీరియా, వైరస్, ఫంగీ, పరాన్నజీవులతో ఇన్ఫెక్ట్ అయితే ఆయా జంతువుల నుంచి మానవులకు కొన్ని ప్రమాదకర వ్యాధులు సంక్రమిస్తాయి. ఈ విధంగా జంతువుల నుంచి మనుషులకు (జునోటిక్) లేదా మనుషుల నుంచి జంతువులకు సంక్రమించే (రివర్స్ జునోటిక్) వ్యాధులను "జునోటిక్ వ్యాధులు"గా పిలుస్తాం. దాదాపు 130 రకాల సూక్ష్మజీవులు, 60 వరకు పరాన్నజీవుల వల్ల దాదాపు 250 రకాల జునోటిక్ వ్యాధులు సోకుతాయని వెల్లడయ్యింది. . ప్రపంచవ్యాప్తంగా 114కు పైగా దేశాల్లో జునేటిక్ వ్యాధుల బెడద అధికంగా నమోదు అవుతున్నాయి. ప్రతి 10 వ్యాధుల్లో 6 జునోటిక్ సంబంధ వ్యాధులే ఉన్నాయని తెలుస్తున్నది.

**ప్రపంచ జునోసిస్ దినం-2026 ఇతివృత్తం:**

జునోటిక్ వ్యాధుల పట్ల సంపూర్ణ అవగాహన, నివారణ చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలను చర్చించే వేదికలుగా ప్రతి ఏట 06 జూలై రోజున "ప్రపంచ జునోసిస్ దినం (వరల్డ్ జునోసిస్ డే)" పాటించనట ఆనవాయితీగా మారింది. 06 జూలై 1885 రోజున "లూయీ పాశ్చర్" అను ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు తొలిసారి పిచ్చి కుక్క కరిచిన వ్యక్తికి ఆంటీ రాబిస్ టీకా ఇవ్వడం జరిగింది. ఈ విప్లవాత్మకమైన ఘనతకు గుర్తుగా ప్రతి ఏట 06 జూలైన ప్రపంచ జునోసిస్ దినం పాటించడం పరిపాటి అయ్యింది. ప్రపంచ జునోసిస్ దినం-2026 ఇతివృత్తంగా "ఒకే ప్రపంచం, ఒకే ఆరోగ్యం (వన్ వరల్డ్, వన్ హెల్త్)" అను అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం ప్రకారం 61 శాతం వ్యాధులు జునోటిక్ సంబంధమైనవే అని, దాదాపు 1400 వ్యాధికారక సుక్ష్మజీవులు లేదా పాథోజెన్స్ పలు రకాల జంతువులను ఇన్ఫెక్ట్ చేస్తాయని, గత దశాబ్ద కాలంలో కరోనా లాంటి 75 శాతం కొత్త జునోటిక్ వ్యాధులే ఉన్నాయని తేల్చారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 మిలియన్ల ప్రజలు సాదు జంతువులతో సహజీవనం చేస్తున్నారు. ఈగలు, దోమలు,





పేలు,
కీటకాలతో కూడా జునోటిక్ వ్యాధులు సంక్రమించవచ్చు. గతంలో మిలియన్ల ప్రజల మరణాలకు కారణం అయిన బొవైన్ టిబీ, బుబోనిక్ ప్లేగ్, గ్లార్స్, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు కూడా జునోటిక్ సంబంధమైనవా మాత్రమే అని తెలుసుకోవాలి.

**జునోటిక్ వ్యాధులు సోకడానికి కారణాలు:**

ప్రత్యక్షంగా వ్యాధికారక బ్యాక్టీరియా లేదా వైరస్ సోకిన పెంపుడు జంతువుల లాలాజలం, మూత్రం, మలం, రక్తం, శ్లేష్మం లాంటివని మనుషులు తాకినపుడు జునోటిక్ వ్యాధులు సోకుతాయి. పెంపుడు జంతువులను తాకినా, సమీపంలో గడిపినా, గోర్లతో గీకినా కూడా ఈ వ్యాధులు రావచ్చు. కలుషిత, పూర్తిగా ఉడకని ఆహారం (మాంసం, గుడ్లు, పాలు, జంతువులు ముట్టిన పండ్లు) తీసుకున్నపుడు కూడా ఈ వ్యాధులు రావచ్చు. పచ్చి పాలు తాగినా జునేచిక్ వ్యాధులు రావచ్చుని, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులకు కూడా జునోటిక్ వ్యాధులు సులభంగా సోకుతాయి. భారత్‌లో జునోటిక్ వ్యాధుల బెడద అధికంగా కనిపిస్తున్నది. సాదు జంతువులు, జంతు ప్రయోగశాలలు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, పశు వైద్యులు, చర్మం/తోళ్ళ పరిశ్రమలు, ధాన్య గిడ్డంగులు జునోటిక్ వ్యాధులకు కారణాలుగా నిలుస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. పాడి పంటలు, సాదు జంతువులే జీవనోపాధులుగా గడుపుతున్న పేద కుటుంబాలకు జునోటిక్ వ్యాధుల సమస్యలు అధికంగా ఉంటున్నాయి.

**జునోటిక్ వ్యాధుల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలు:**

జునోటిక్ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. జంతువులను తాకిన ప్రతిసారా చేతులను శు భ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. దోమలు, ఈగలు లాంటివని రాకుండా జాగ్రత్త పడాలి. పచ్చి పాలు తాగడం మానేయాలి. ఆహారాన్ని పూర్తిగా ఉడికించాలి. వంట సామాగ్రిని శుభ్రంగా కడగాలి. చనిపోయిన జంతువులను భూమిలో పాతి పెట్టాలి. జంతువులను తాకు సందర్భాల్లో మాస్కులు, చేతి గ్లౌజులు ధరించాలి. అధిక కాలం ఫ్రిజ్‌లో నిలువ ఉంచిన ఆహారాన్ని తీసుకోరాదు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి. జంతు మలమూత్రాలతో నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. త్రాగే నీటిని మరిగించి వాడాలి. గర్భిణులు, శిశువులు, వృద్ధులు, అవయవ మార్పిడి చేయించుకున్న వారు, మధుమేహం గల వారు, ఆల్కహాల్ సేవించే వారు జునోటిక్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

పెంపుడు జంతువులతో జాగ్రత్తగా మసులుకుంటూ, జీవనోపాధులను పొందుతూ, జునోటిక్ వ్యాధులకు దూరంగా, ఆరోగ్యకర కుటుంబాలకు దగ్గరగా జీవిద్దాం, జంతు సంబంధ వ్యాధులను పొలిమేరలు దాటిద్దాం.



# కరీంనగర్ జిల్లా ప్రజలకు శుభవార్త






బ్యాడ్మింటన్ .
టేబుల్ టెన్నిస్ .చెస్
.క్యారం బోర్డు రంగంలో
ఆసక్తిగలవారికి గంటకు
300 రూపాయల చొప్పున
కోర్టును, బ్యాడ్మింటన్, టేబుల్
టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు ఆటకు
ఇవ్వబడును. ముందస్తు బుకింగ్
చేసుకున్న వారికి ఇవ్వబడును
బుకింగ్ చేసుకోవాల్సిన
ఫోన్ నెంబర్
9246966660






## ఆట వేళలు


ఉదయం 5 గంటల నుంచి
రాత్రి 10 గంటల వరకు

మన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .క్యారం బోర్డు. చెస్. వంటి క్రీడలను ఇప్పుడు మన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇవ్వబడును. నిపుణులైన కోచులచే బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు వంటి క్రీడలలో శిక్షణ ఇవ్వబడును.కరీంనగర్ జిల్లా లోని విద్యార్థినీ విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు నిపుణులైన కోచునులచే శిక్షణ ఇవ్వబడును.

ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు

ఇండోర్ స్టేడియం క్రీడాకారుల కోసం తెరిచి ఉంచబడును. కావున ఆసక్తిగల క్రీడాకారులు విద్యార్థిని విద్యార్థులు శిక్షణ కోసం మరియు ఆట ఆడుకునే అందుకోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్.9246966660








జనచిత్రం

# భక్తి కంటే పారదర్శకత ముఖ్యం



డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్

అయోధ్య రామమందిరం కేవలం ఒక ఆలయం కాదు. కోట్లాది మంది హిందువుల విశ్వాసానికి ప్రతీక. దేశ విదేశాల నుంచి వచ్చిన భక్తుల విరాళాలు, బంగారం, వెండి, ఆభరణాలు, నగదు, విలువైన కానుకలు అన్నీ భక్తుల ఆరాధనకు ప్రతిరూపాలు. అలాంటి పవిత్రమైన స్థలంలో విరాళాల దుర్వినియోగం, నగదు మరియు విలువైన వస్తువుల మాయంపై వెలుగులోకి వచ్చిన ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారితీశాయి. ఈ వ్యవహారంలో అసలు ప్రశ్న కేవలం దొంగతనం జరిగిందా లేదా అన్నది కాదు. నిజంగా ఎవరి బాధ్యత? విచారణ ఎవరిని చేరుతోంది? ఎవరిని వదిలేస్తోంది? అనే అంశాలే ప్రజల అనుమానాలకు కేంద్రబిందువుగా మారాయి.

ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కొన్ని ఆలయ సిబ్బందిని అరెస్టు చేసింది. వారి వద్ద కొంత నగదు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇదే సమయంలో విచారణ పరిధిని గత ఐదేళ్ల ఆర్థిక లావాదేవీల వరకు విస్తరించి ట్రస్ట్ ఖాతాలపై మళ్లీ ఆడిట్ నిర్వహించాలని కూడా సిట్ నిర్ణయించింది. ఆలయంలో నగదు లెక్కింపు, విలువైన వస్తువుల నిర్వహణ, సీసీటీవీ పర్యవేక్షణ, అంతర్గత నియంత్రణ వ్యవస్థల్లో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ప్రాథమిక పరిశీలనలో వెల్లడైనట్లు పలు జాతీయ మీడియా సంస్థలు పేర్కొన్నాయి.

అయితే ప్రజల్లో ఎక్కువగా వినిపిస్తున్న ప్రశ్న ఏమిటంటే, కింది స్థాయి సిబ్బంది మాత్రమే ఈ వ్యవహారానికి బాధ్యులా? లేక పరిపాలనా స్థాయిలో కూడా బాధ్యత వహించాల్సిన వారు ఉన్నారా? ఒక పెద్ద సంస్థలో కోట్ల రూపాయల విరాళాల నిర్వహణ సంవత్సరాల పాటు జరుగుతుంటే, పరిపాలనా బాధ్యతలు నిర్వహించే ఉన్నతాధికారులకు ఏమాత్రం సమాచారం లేకపోవడం సహజమా? పరిపాలనా నిర్లక్ష్యం ఉన్నా అది కూడా విచారణలో భాగం కావాల్సిందే అనే వాదన వినిపిస్తోంది.

ఈ నేపథ్యంలో ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి సంపత్ (చంపత్) రాయ్‌ను సిట్ ప్రశ్నించినప్పటికీ, విచారణ వివరాలు వెల్లడించలేదు. ఆయన నైతిక బాధ్యత వహిస్తూ పదవి నుంచి తప్పుకున్నట్లు వార్తలు వచ్చినా, ఆయన పాత్రపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిగిందా అనే సందేహాలు కొనసాగుతున్నాయి.ఇంత వరకు ఆయన పై ,ఇతర ముఖ్య ఆలయ నిర్వాహకులపై ఎఫ్ఐఆర్ ఎందుకు బుక్ చేసి విచారణకు ఎందుకు పిలవలేదు? ఇంత పెద్ద ఆర్థిక నేరం అంతర్గతగా చాలా ఏళ్ళ క్రితమే వెలుగులోకి వచ్చినా...ఆ నిజాలను ఎవరు ఉద్దేశ పూర్వకంగా తొక్కిపెట్టారు? ఇందులో కీలక పాత్రధారులు ఎవరు? ఈ ప్రశ్నలు హిందూ భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయి.



ఈ కేసులో మరో ముఖ్యమైన అంశం బాధ్యత వహించే వ్యవస్థల పాత్ర. ఒకవైపు గతంలో ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలు సక్రమంగానే ఉన్నాయని ఎవరు ? ఏ హోదాలో బుకాయించారు?. ఇప్పుడు అదే ఖాతాలను మళ్లీ ఐదేళ్ల కాలానికి రీ-ఆడిట్ చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? ఒకవేళ మొదటి ఆడిట్ పూర్తిగా సరిగానే జరిగి ఉంటే రెండోసారి సమగ్ర పునఃపరిశీలన అవసరం వచ్చేదా? లేక మొదటి ఆడిట్‌లో గుర్తించని అంశాలు ఇప్పుడు బయటపడుతున్నాయా? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత సంస్థలపై ఉంది.

భక్తులు ఆలయానికి విరాళం ఇవ్వడం అనేది కేవలం దానం కాదు. అది విశ్వాసం. ఆ విశ్వాసాన్ని పరిరక్షించడం ట్రస్ట్ యొక్క అత్యున్నత బాధ్యత. అందుకే ఇలాంటి సంస్థల్లో సాధారణ ప్రభుత్వ కార్యాలయాల కంటే మరింత కఠినమైన ఆర్థిక నియంత్రణ వ్యవస్థ ఉండాలి. ప్రతి రూపాయి, ప్రతి గ్రాము బంగారం, ప్రతి వెండి వస్తువు డిజిటల్ రికార్డుతో పాటు స్వతంత్ర ఆడిట్ వ్యవస్థ ద్వారా పర్యవేక్షించబడాలి. అలాంటి వ్యవస్థ బలహీనంగా ఉంటే దానికి కేవలం కింది స్థాయి ఉద్యోగులను మాత్రమే బాధ్యులుగా చేయడం పరిపాలనా బాధ్యతను తప్పించుకోవడంగా భావించే అవకాశం ఉంటుంది.

ప్రస్తుతం రాజకీయ విమర్శలు కూడా తీవ్రంగా కొనసాగుతున్నాయి. ప్రతిపక్ష పార్టీలు, కొందరు న్యాయవాదుల సంఘాలు, సాధువులు, భక్తులలో ఒక వర్గం ఈ కేసులో ట్రస్ట్ కీలక బాధ్యులపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నాయి. ఫైజాబాద్ బార్ అసోసియేషన్ కూడా కొందరు కీలక ట్రస్ట్ సభ్యులపై కేసు నమోదు చేయాలని కోరింది.

ఇక్కడ మరో కోణం కూడా గుర్తుంచుకోవాలి. ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన ఆరోపణలు అన్నీ ఇంకా దర్యాప్తు దశలోనే ఉన్నాయి. న్యాయపరంగా ఎవరి మీదా తుది నేర నిర్ధారణ కాలేదు. అందువల్ల విచారణ పూర్తికాకముందే ఎవరినైనా నేరస్థులుగా ప్రకటించడం సమంజసం కాదు. అదే సమయంలో విచారణ ఎలాంటి పక్షపాతం లేకుండా అన్ని స్థాయిల బాధ్యులను సమానంగా పరిశీలించాలి అనే ప్రజాస్వామ్య సూత్రం కూడా అంతే ముఖ్యమైనది.



ఈ కేసు రాజకీయంగా కూడా అత్యంత సున్నితమైనది. ఎందుకంటే రామమందిరం నిర్మాణాన్ని దేశ రాజకీయాల్లో ఒక చారిత్రక ఘట్టంగా ప్రస్తావించిన నాయకత్వం ఇప్పుడు ఈ వివాదంపై ఏ మేర స్పందించాలి అనే చర్చ కొనసాగుతోంది. ప్రధానమంత్రి లేదా కేంద్ర మంత్రివర్గం ఇప్పటివరకు ప్రత్యేకంగా స్పందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. అయితే ట్రస్ట్ స్వతంత్ర సంస్థగా పనిచేస్తుందని, కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాలకు అది ప్రత్యక్ష పరిపాలనా ఆధీనంలో లేదని కేంద్ర హోంశాఖ గతంలో కేంద్ర సమాచార కమిషన్‌కు తెలియజేసిన విషయం కూడా ఉంది.

అయితే చట్టపరమైన స్వతంత్రత ఉన్నప్పటికీ, కోట్లాది ప్రజల విశ్వాసానికి సంబంధించిన అంశం కావడంతో పూర్తి పారదర్శకత అవసరమని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఆలయ ట్రస్ట్ ప్రభుత్వ నియంత్రణలో లేకపోయినా, ప్రజా విశ్వాసం ఆధారంగా నడిచే సంస్థగా తన ప్రతి చర్యకు సమాధానం చెప్పాల్సిన నైతిక బాధ్యత మాత్రం తప్పదు.

ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో లేదా స్వతంత్ర కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరపాలని కొందరు భక్తులు, సామాజిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. అలాంటి డిమాండ్‌ను అంగీకరించాలా వద్దా అనేది సంబంధిత ప్రభుత్వాలు, న్యాయస్థానాలు నిర్ణయించాల్సిన అంశం. కానీ ఇలాంటి డిమాండ్లు ఎందుకు వస్తున్నాయో అర్థం చేసుకోవడం అవసరం. ప్రజల్లో విశ్వాసం తగ్గినప్పుడు మాత్రమే మరింత స్వతంత్ర దర్యాప్తు కోసం డిమాండ్ పెరుగుతుంది.

ఈ సంఘటన ఒక ఆలయానికి మాత్రమే పరిమితం కాదు. దేశంలోని అన్ని పెద్ద మత సంస్థలకు ఇది ఒక హెచ్చరిక. కోట్లాది రూపాయల విరాళాలు వచ్చే ప్రతి సంస్థలో అంతర్గత ఆడిట్‌తో పాటు స్వతంత్ర బాహ్య ఆడిట్, ఆధునిక డిజిటల్ ఇన్వెంటరీ, నిరంతర సీసీటీవీ పర్యవేక్షణ, ప్రతి విరాళానికి ఆన్‌లైన్ ట్రాకింగ్ వంటి వ్యవస్థలు తప్పనిసరిగా ఉండాలి. పారదర్శకత పెరిగినప్పుడే భక్తుల విశ్వాసం బలపడుతుంది.

చివరికి ఈ వివాదంలో అత్యంత విలువైనది బంగారం కాదు, వెండి కాదు, నగదు కాదు. కోట్లాది మంది భక్తుల విశ్వాసం. ఈ కేసులో " దొంగలే దర్యాప్తు చేస్తే ఎలా? ఈ సిట్ లో దర్యాప్తు అధికారులు కూడా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటారు.అలాంటప్పుడు దర్యాప్తు నిష్పాక్షికంగా ఏలా జరుగుతుంది? అనే అనుమానాలను హిందూ భక్తులు తమ సందేహాలను సోషల్ మీడియాలో విపరీతంగా వ్యక్తం చేస్తున్నారు.

అయోధ్య ట్రస్టును కేంద్ర ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. తమకు అనుకూలమైన దొంగలను అందులో నియమించింది. ఇప్పుడు దొంగతనానికి పాల్పడినవారే, దొంగతనంపై దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో న్యాయం జరుగుతుందని ఎలా ఆశించగలం అని స్వామి అవిముక్తేశ్వరానంద్ సరస్వతి (జ్యోతిర్మఠ్ శంకరాచార్య) కూడా అన్నారు.

ఆ విశ్వాసాన్ని కాపాడటానికి నిజాలు ఎంత అసౌకర్యంగా ఉన్నా అవి వెలుగులోకి రావాలి. విచారణ ఎలాంటి రాజకీయ, పరిపాలనా లేదా సంస్థాగత ఒత్తిళ్లకు లోనుకాకుండా అన్ని స్థాయిల బాధ్యులను సమానంగా పరిశీలించాలి. నిర్దోషులను రక్షించడం ఎంత ముఖ్యమో, తప్పు చేసిన వారిని హోదా, ప్రభావం, పదవి అనే తేడా లేకుండా చట్టం ముందు నిజాయితీగా, రాగద్వేషాలకు అతీతంగా నిలబెట్టడం కూడా అంతే ముఖ్యం. రాముడి పేరు మీద నిర్మించిన ఆలయంలో రామరాజ్య విలువలు నిలవాలంటే భక్తి మాత్రమే కాదు, భక్తులు సమర్పించిన కానుకలు, వాటికి భద్రత , వాటి ద్వారా బ్యాంకుల నుండి లభించిన వడ్డీ మొదలైన విషయాలన్నింటిపై పారదర్శకత, జవాబుదారీతనం, న్యాయపాలన కూడా సమానంగా నిలవాలి. అదే ఈ వివాదం దేశానికి నేర్పుతున్న అత్యంత ముఖ్యమైన పాఠం.

## కార్పొరేటర్ ల ఫోన్ టెండర్లను రద్దు చేయాలి



**జనసైన్యం సిటి**

కార్పొరేటర్ల ఫోన్ కొనుగోళ్ల కోసం టెండర్లు నిర్వహించడాన్ని సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని వెంటనే టెండర్లను రద్దు చేయాలని లేకుంటే సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని సిపిఐ నగర కార్యదర్శి రెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి ఒక ప్రకటనలో మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి సురేందర్ రెడ్డి,పైడిపల్లి రాజు,న్యాలపట్ల రాజు మాట్లాడుతూ నగరంలో ప్రజల దగ్గర ఇంటి పన్ను పేరా, నల్ల బిల్లు పేరా చివరికి చెత్త తీసుకపోవడానికి కూడా ప్రజల వద్ద వందల రూపాయలు దోచుకెళ్తున్న అధికారులు కార్పొరేటర్లు,కోఆప్షన్ సభ్యుల సెల్ ఫోన్ల కొనుగోళ్ల కోసం లక్షల రూపాయలు ఖర్చు చేయడం సిగ్గుచేటు అన్నారు. నగరంలో వీధిదీపాలు, డ్రైనేజీలు వర్షం వస్తే నీటి నిలువ ఉండకుండా చర్యలు తీసుకోలేని చేతగాని దుస్థితిలో ఉన్న మున్సిపల్ అధికారులకు లక్షల రూపాయలు కార్పొరేటర్ల ఫోన్లు కొనడానికి మాత్రం ఏ విధంగా వస్తున్నాయని వారు ప్రశ్నించారు. వెంటనే మున్సిపల్ అధికారులు ప్రజాధనం వృధా చేయకుండా కార్పొరేటర్ల సెల్ ఫోన్ల కోసం కేటాయించిన టెండర్లను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.మున్సిపల్ అధికారులు వెంటనే టెండర్లను రద్దు చేయకుంటే మున్సిపల్ ఆఫీసును ముట్టడించి ప్రజలకు ఈ అవినీతిని బయటపెడతామని కసిరెడ్డి సురేందర్ రెడ్డి,పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజులు పేర్కొన్నారు.

## మేము వెళ్లిపోతున్నాము జాగ్రత్త.. తమ్ముడిని జాగ్రత్తగా చూసుకో



**జనసైన్యం సిటి**

హైదరాబాద్ - ఘట్‌కేసర్ పరిధిలో రైలు కింద పడి ఆత్మహ....త్య చేసుకున్న కుంట్లూర్ ప్రాంతంలో నివాసం ఉండే రవికుమార్(42), శిరీష(33) దంపతులు.ఆత్మహ...త్యకు ముందు తమ పిల్లలు సుశాంత్(9వ తరగతి), విధ్వాంస్(6వ తరగతి)లకు వీడియో కాల్ చేసి కన్నీటి వీడ్కోలు.చైతన్యపురిలో బియ్యం దుకాణం నడుపుతూ, ఇటీవల రెడీమిక్స్ వాహనాన్ని తీసుకొని అప్పులపాలైన రవికుమార్.గురువారం ఉదయం పిల్లలు పాఠశాలకు వెళ్ళిన తర్వాత, రవికుమార్ ఇంటికి వెళ్లి గొడవ పడిన కొందరు మహిళలు.తర్వాత చైతన్యపురిలోని బియ్యం దుకాణం వద్దకు వెళ్లి, రాత్రి 7:30 గంటల సమయంలో పిల్లలకు కాల్ చేసి తమ్ముడిని బాగా చూసుకో.. మీరు కొట్టుకోవద్దు అని జాగ్రత్తలు చెప్పి కన్నీటి వీడ్కోలు పలికిన తల్లిదండ్రులు. ఎక్కడున్నారమ్మ.. ఎందుకలా మాట్లాడుతున్నారు అంటూ పిల్లలు అడగగా కొద్దిసేపట్లో వస్తామంటూ చెప్పి వెళ్లి ట్రైన్ కింద పడి బలవన్మరణం.వ్యాపార, వ్యక్తిగత వివాదాలపై, ఆర్థిక పరిస్థితులపై ఆరా తీస్తూ ఆత్మహ...త్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు.

## తండాల " అభివృద్ధి బోర్డు " ఏర్పాటు చేయాలి



**జనసైన్యం సిటి**

రాష్ట్రంలో 3 వేలకు పైగా ఉన్న తండా గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి రెవిన్యూ గ్రామాలు గా గుర్తించి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమా సాహెబ్ ప్రభుత్వాన్ని కోరారు... ఈరోజు హైదరాబాద్లో జరిగిన రాష్ట్ర స్థాయి గిరిజన సంఘం ముఖ్య కార్యకర్త సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అలాగే మైదాన ప్రాంతాలలో గిరిజనుల అభివృద్ధికి ITDA లను ఏర్పాటు చేయాలని కోరారు.. చేవెళ్ల డిక్లరేషన్ లో గిరిజనులకు ప్రకటించిన 12 రకాల హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు..ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బోడ మోహన్ నాయక్, నగర కార్యదర్శి రవీందర్ నాయక్,నాయకులు అరవింద్ ,రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంబరాలు ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు




రైతు సంక్షేమే ప్రజా ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యతగా, వ్యవసాయాన్ని పండుగలా మార్చే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది.

అన్నదాతలకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులను విడతల వారీగా విడుదల చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది.

జూలై 4, 2026 నాటికి...

67.44 లక్షల మంది రైతులకు

1.18 కోట్ల ఎకరాలకు రూ. 7,135.77 కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేయడం జరిగింది.ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ బొమ్మకల్‌లో మరియు కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, రైతన్నలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు , BC సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కార్పొరేటర్, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ గారు పాల్గొని మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని, రైతు భరోసా ద్వారా లక్షలాది రైతులకు అండగా నిలుస్తోందని అన్నారు. ఈ దేశంలో రైతుల పక్షాన నిలబడి రైతులకు ఏదైనా సంక్షేమం చేసిందంటే అది కాంగ్రెస్ పార్టీయే. దేశవ్యాప్తంగా గత ఖూూ ప్రభుత్వంలో రైతులకు ఏకాలంలో రుణమాఫీ చేసింది కూడా కాంగ్రెస్సే. నేడు అదే స్ఫూర్తితో రేవంత్ అన్న ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక ఏకాలంలో రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేయడంతో పాటు, రైతులకు ఉచిత కరెంటు, సన్న వడ్లకు క్వింటాకు రూ. 500 బోనస్ వంటి అనేక కార్యక్రమాలతో రైతులకు అండగా నిలుస్తోంది. రైతు ప్రభుత్వాన్ని, రేవంత్ అన్న నాయకత్వాన్ని మరొక్కసారి ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు K. రాంరెడ్డి, సాయిని తిరుపతి, బొమ్మకల్లు జరిగిన కార్యక్రమంలో కపిల్ మాధవ్, గట్టు ప్రశాంత్, దీ. ఆంజనేయులు, ఇమ్రాన్, పెంట శేఖర్ వసీం ఫాహాద్, ఇమ్రాన్ గాని, చామనపల్లి గ్రామ రైతు వేదిక లో పాల్గొన్న గ్రామ సర్పంచ్ ఐలన్న, సర్పంచ్ తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫకీర్‌పేట్, సర్పంచ్ లక్ష్మణ్ నారాయణ, సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీకాంత్, గ్రామ శాఖ అధ్యక్షుడు శంకరయ్య, తిరుపతి గౌడ్, సేవాదళ్ నాయకుడు ముస్తాక్, హైమద్, హరీష్ గౌడ్, శివరాం, మీసాల సాయన్న, కాశిపాక మురళి, బాలకిషన్ తదితర నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పుష్కరాల నాటికి ఆలయాలకు ప్రత్యేక శోభ



రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**జనసైన్యం సిటి**

గోదావరి పుష్కరాలకు ముందే గోదావరి తీరంలోని ఆలయాలకు కొత్త శోభ తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామంలోని శ్రీ కోటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గోదావరి పుష్కరాలకు ఏడాది ముందుగానే ఏర్పాట్లు చేయడానికి బడ్జెట్ లో నిధులు కేటాయించారని మంత్రి అన్నారు. గోదావరి తీరం వెంట బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర అభివృద్ధికి నిధులు కేటాయించడంతో పాటు కోటిలింగాలలోని కోటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించినట్లు మంత్రి వివరించారు. ధర్మపురి నియోజకవర్గానికి పుష్కర పనుల కోసం రూ.117 కోట్లు కేటాయించగా ఇందులో కోటిలింగాలలో పుష్కర ఘాట్ నిర్మాణానికి రూపాయలు 8 కోట్లు కోటిలింగాల నుండి పాశీగాం వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 8 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు.ధర్మపురి ఉగ్ర నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి రూ. 10 కోట్లు కేటాయించగా వెల్గటూర్ నుండి కోటిలింగాల వరకు నాలుగు లైన్ల రహదారి విస్తరణ కొరకు రూ. 20 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. కోటిలింగాలతోపాటు రాజక్క పల్లి వద్ద మిని ట్యాంక్ బండ్ మాదిరిగా నిర్మాణం చేస్తామని మంత్రి తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత..


కోటిలింగాల గ్రామానికి చెందిన మంచి కట్ల మణితేజ ఇటీవల కుక్క కాటుకు గురై మరణించగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5లక్షల చెక్కును మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఈ సందర్భంగా మణితేజ కుటుంబ సభ్యులకు మంత్రి అందజేశారు.



శ్రీ శ్రీ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



రవీందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



బోయిని రిషిత్ రీత్వికలకు జన్మదిన శుభాకాంక్షలు

## ఇందిరమ్మ ఇళ్ళ పట్టాలు పంపిణీ చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్



జనసైన్యం సిటి

హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ లో నాంపల్లి డ చాంద్రాయణ గుట్ట నియోజకవర్గాలకు సంబంధించి 361 మంది లబ్ధిదారులకు 2 ఎస్ట్రన్ పట్టాలు పంపిణీ చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ .

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ,ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఓవైసీ, మాజిద్ హుస్సేన్ ,మినరల్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవర్తి అనిల్, బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్ ,జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా,ఇతర ముఖ్య నేతలు, అధికారులు ..

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... ఇళ్ల పట్టాలు పొందుతున్న నాంపల్లి, చాంద్రాయణ గుట్ట నియోజకవర్గాలకు సంబంధించిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు..2016 లో మీరు మీ గుడిసెలు ఖాళీ చేశారు.. అదే స్థలంలో ఇల్లు నిర్మించడం జరిగింది..ఈరోజు మీకు ఇండ్ల పట్టాలు ఇస్తున్నాం..

హైదరాబాద్ లో పేదలకు ఉపాధి ఉన్న చోటనే ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది .వందలకోట్ల విలువైన భూములను పేదల ఇళ్ల నిర్మాణాలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది..ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో లక్ష ఇండ్లు కట్టి పేదలకు ఇస్తాం.. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో 40-50 స్థలాలు గుర్తించాం..

ఇక్కడ ఉపాధి అవకాశాలు ఉంటే అక్కడే ఇల్లు నిర్మించాలని మా ప్రభుత్వ లక్ష్యం .గత ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూమ్స్ ఇస్తామని ఆశ చూపెట్టి మోసం చేసింది.. వాళ్ళు కట్టిన ఇళ్ళు నగరానికి దూరంగా ఉన్నాయి..ప్రజల ఉపాధి ఒక దగ్గర ఉంటే ఇల్లు మరో దగ్గర ఉండేవి..రాష్ట్రంలో ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాం..మొదటి దశలో నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం ఇవి పూర్తయ్యాయి..రెండవ దశలో 2 వేల ఇళ్లు ఇస్తున్నాం..

గత ప్రభుత్వంలో 10 సంవత్సరాల్లో రేషన్ కార్డులు ఇవ్వలేదు.. మేము అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు పంపిణీ చేశాం.అర్హత ఉండి రేషన్ కార్డులు లేనివారి అప్లై చేసుకుంటే 48 గంటల్లో ఇస్తున్నాం.సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం..200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం..500 కి గ్యాస్ సబ్సిడీ ఇస్తున్నాం...మహిళలందరూ స్వయం సహాయక సంఘాల లో జాయిన్ అవ్వాలి..మా నియోజకవర్గంలో లక్ష మంది మహిళలు ఉంటే 80 వేల మంది మహిళలు మహిళా సంఘాల్లో చేరారు..హైదరాబాద్ నగరంలో మహిళా సంఘాల్లో చేరిన వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది..సంఖ్య పెంచాలని అధికారులను ఆదేశించాం..మహిళా సంఘాలకు వడ్డీలు లేని రుణాలు ఇస్తున్నాం.. ఉపాధి అవకాశాలు పెంచుకోవడానికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాం..రాష్ట్రంలో ఎక్కడికి వెళ్ళాలన్న ఉచిత బస్సు సౌకర్యం అందిస్తున్నాం..5 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్ రానుంది.గతిలో ఇచ్చిన వాంబే ఇండ్లు కూలిపోయే స్థితిలో ఉన్నాయి..వాటిని పరిశీలించి రిపేర్ చేయడమా లేక కూల్చేయాలా అనేది పరిశీలించి రిపోర్ట్ ఇవ్వాలని కలెక్టర్ ను కోరుతున్నా.

త్వరలో 2 లక్షల మంది ఒంటరి మహిళలకు పెన్షన్ ఇవ్వడానికి ప్లాన్ చేస్తుంది ప్రభుత్వం .రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా... ప్రభుత్వ పథకాలు కొనసాగిస్తున్నాం. విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాం..సర్కార్ స్కూల్స్ లో మధ్యాహ్న భోజనం తో పాటు బ్రేక్ఫాస్ట్ కూడా ఇస్తున్నాం..మీ పిల్లలను ప్రభుత్వ స్కూల్స్ లో చేర్పించండి.. మేమంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని వచ్చిన వాళ్ళమే.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం..

